క్లుప్తంగా

ఆటోనగర్‌లో పర్యటించిన ఏపీటీపీసీ చైర్మన్



ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావుకు అభినందనలు తెలుపుతున్న వేర్ హౌస్ గొడౌన్ల యజమానులు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జా బాబూరావు బుధవారం ఆటోనగర్‌లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ యాదవజగ్గరాజుపేట వద్ద రెండు వేర్ హౌస్ గొడౌన్లు ఉన్నాయని, కార్పొరేషన్ స్థాయిలో రేసపువానిపాలెం, బీచ్ రోడ్డులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆయా గొడౌన్లలో ఏయే పనులు నిర్వర్తిస్తున్నారో, వాటి స్థితి గతులను తెలుసుకోవడానికి పర్యటించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన్ను వేర్ హౌస్ గొడౌన్ల యజమానులు సత్కరించారు. కార్యక్రమంలో హనుమాన్ నాయక్, జనశిక్షణా సంస్థాన్ చైర్మన్ రామరాజు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



శివాలయ అభివృద్ధికి నగదు అందిస్తున్న పట్టా రామ అప్పారావు దంపతులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడిలోని స్వయంభు బ్రహ్మసూత్ర శివాలయం అభివృద్ధికి వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ పట్టా రామ అప్పారావు దంపతులు ఆలయ ధర్మకర్తకు రూ.5వేల నగదు అందించారు. రామ అప్పారావు మాట్లాడుతూ బ్రహ్మ సూత్రాలు కలిగిన శివాలయం అగనంపూడిలో మాత్రమే ఉందన్నారు. ఇలాంటి శివాలయాలు అరుదుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

40 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న శ్రీచైతన్య సిబ్బంది

గాజువాక: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా ఆ సంస్థ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పాఠశాల ఏజీఎం శ్రీనివాసరావు ప్రారంభించారు. 40 మంది సిబ్బంది రక్తదానం చేసినట్టు స్కూల్స్ రీజినల్ ఇన్‌చార్జి రమణ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్స్ ఏజీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో వైద్యం చేసే వారికి తగిన గుర్తింపు



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అగనంపూడి: పట్టణాలు, నగరాల్లోని మురికివాడలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించే వైద్యులకు తగిన గుర్తింపు వచ్చేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలోని ఫోర్ ఎస్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన వైద్య విజ్ఞాన్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు, మురికివాడల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు తనవంతు పాటు పడతానన్నారు. తర్వాత ఎమ్మెల్యేను సంఘ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జంగం జోషి, గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, ఫోర్ ఎస్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పి.మురళీకృష్ణ, సీహెచ్ తపన్‌కుమార్, పి.రవిశంకర్, గీతిక, సృజన తదితరులు పాల్గొన్నారు.

వదల బొమ్మాళీ..

మరుభూమికీ ఆక్రమణల బెడద!

అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. ఆ క్రమంలో శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించడంతో పాటు మరి కొన్ని స్థలాలను తమ వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారు. ఫలితంగా ఆఖరి మజిలీకి కూడా ఇక్కట్లు తప్పడం లేదు.

- ఆఖరి మజిలీకీ చిక్కులే
- శ్మశాన వాటికలో కార్ల మరమ్మతులు
- పట్టించుకోని అధికారులు



తోకాడ శ్మశానవాటిక స్థలంలో నిర్మించిన ప్రైవేటు షెడ్, పార్క్ చేసిన కార్లు

అక్కిరెడ్డిపాలెం: శ్మశాన వాటికల నిర్వహణను గాలికి వదిలేయడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఆఖరి మజిలీకి ఉపయోగించే వీటిల్లో కూడా పాగా వేస్తున్నారు.71వ వార్డు తోకాడ శ్మశాన వాటికలో ప్రైవేటు వ్యక్తి షెడ్ నిర్మించాడు. సుమారు ఎకరం స్థలం చదును చేసి హస్తగతం చేసుకోవడానికి బడాబాబుల ఎత్తుగడలు సాగుతున్నాయి. రాజకీయ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం శ్మశానవాటికను పట్టించుకోకపోవడంతో మృతుల ఆత్మలు ఘోషిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

అధ్వానంగా శ్మశాన వాటిక

జీవీఎంసీ 71వ వార్డు తోకాడలోని శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేపట్టడానికి అవకాశం లేకుండా పోయింది. పిచ్చిమొక్కలు, కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. దీంతో ఎవరైనా తనువు చాలిస్తే ఆటోనగర్ చట్టివానిపాలెం శ్మశానవాటిలో తీవ్ర ఇబ్బందుల నడుమ దహన సంస్కారాలు చేపట్టే పరిస్థితి ఏర్పడింది.



తుప్పలతో ఖబరిస్థాన్

అభివృద్ధికి మోకాలడ్డు!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శ్మశానవాటికల అభివృద్ధికి వార్డు పరిధిలో ఉన్న శ్మశానవాటికలను రూ.1 కోటి 70 లక్షల వరకు నిధులు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పించారు. కానీ 71వ వార్డు కార్పొరేటర్ శ్మశానవాటిక అభివృద్ధిని విస్మరించారు. సుమారు 30 నుంచి 40 వేల జనాభా కలిగిన తోకాడ, ఎల్.వి.నగర్, ఆటోనగర్ పరిసరప్రాంతాల్లో ఎవరు మరణించినా తోకాడ శ్మశాన వాటికకు చేరాల్సిందే.అయితే ఇక్కడ వసతులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. ముస్లింలు ఆఖరి మజిలీకి గాజువాకలోని ఖబరిస్థాన్‌కు తీసుకువెళ్తుండగా, క్రిస్టియన్లు నగరంలోకి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

భయం..భయం

వార్డులోని సర్వే నంబర్ 54లో సుమారు 4 ఎరాల విస్తీర్ణంలో శ్మశానవాటిక ఏర్పాటు చేశారు. హిందూ శ్మశానవాటికలో మొండి పిల్లర్స్‌తో రెండు ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో కొంత భూమిని ముస్లింలకు, క్రిస్టియన్లకు కేటాయించారు. ప్రస్తుతం హిందూ శ్మశానవాటిక కానరాని పరిస్థితి. ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలు సైతం పిచ్చిమొక్కలు పెరిగి భయంకరంగా ఉన్నాయి. ఉన్న శ్మశానవాటిక స్థలంలో కొంత మేర కార్ల రిపేరు, వాటర్ సర్వీసింగ్‌కు వచ్చిన కార్ల పార్కింగ్‌కు దర్జాగా వినియోగించుకుంటున్నారు.



నిర్జీవంగా ఉన్న తోకాడ శ్మశానవాటిక



శ్మశానవాటిక స్థలంలో కార్ల పార్కింగ్

ఆక్రమణకు స్కెచ్



హుద్‌హుద్ ముందు కనీసం తోకాడ శ్మశాన వాటికలో నాలుగు పిల్లర్లకు రేకులైనా ఉండేవి. వాటి కింద దహన సంస్కారాలు చేపట్టేవారు. హుద్‌హుద్‌కు రేకులు ఎగిరి పోవడంతో పిల్లర్లు మాత్రం మిగిలాయి. ఇప్పుడు శ్మశానవాటికలో డెబ్రిస్ వేసి ఆక్రమణలకు ప్రణాళికలు జరుగుతున్నాయి. అడిగేవారు లేరని కొందరు కబ్జాదారులు వ్యవహరిస్తున్నారు. అధికాలు ఎందుకు స్పందించడం లేదు?.

– జి.అన్నపూర్ణ, సామాజిక కార్యకర్త, తోకాడ

ఆఖరిమజిలీకి అవస్థలు



ఎవరైనా మరణిస్తే ప్రశాంతంగా వారి ఆత్మశాంతి చేకూర్చేలా దహన సంస్కారాలు చేయాలంటే మానసిక క్షోభను అనుభవిస్తున్నాం. వేలాది మంది జనాభా ఉన్న తోకాడ పరిసర ప్రాంతాల్లో మరణించిన వారి దహన సంస్కారాలు చేపట్టడానికి మరో శ్మశానవాటికను ఆశ్రయించాల్సి వస్తుంది. అధికారులు వెంటనే తోకాడ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి.

–రవి, తోకాడ

రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం



దగ్ధమైన ద్విచక్రవాహనాలు

అగనంపూడి: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి అగనంపూడి నిర్వాసితకాలనీలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. వాహనదారు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసకు చెందిన బలిరెడ్డి రామారావు కుటుంబ సభ్యులతో కలిసి హైస్కూల్ వెనుక నివాసముంటున్నారు. రామారావు ఇంటి ముందు రోడ్డుమీద పార్క్ చేసి స్కూటీ, బైక్‌లు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దగ్ధం కావడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు రామారావు ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంతమంది యువత మద్యానికి బానిసలుగా మారి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, విచారణ వేగవంతం చేసి సంఘనటకు గల కారణాలు తెలుసుకుంటామన్నారు.

రేపు జాబ్‌మేళా

గాజువాక: జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. పెదగంట్యాడలోని ఎన్ఏసీ సెంటర్‌లో మేళా నిర్వహిస్తామన్నారు. బంధన్ బ్యాంక్, బిగ్ బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ పే కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 7981022453 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

అవగాహనతోనే ఆన్‌లైన్ మోసాలకు కళ్లెం

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ బాగ్చీ

అగనంపూడి: అవగాహనతో ఆన్‌లైన్ మోసాలకు కళ్లెం వేయగలమని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడంతోపాటు తల్లిదండ్రులు, బంధువులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. మొబైల్ ఫోన్ వల్ల కలిగే మంచి కన్నా నేడు చెడు ప్రభావం ఎక్కువగా కనపడుతుందన్నారు. సెల్‌ఫోన్‌లో యాప్‌లను పరిమితికి మించి వాడొద్దని సూచించారు. మొబైల్ ఫోన్, టెక్నాలజీ, సైబర్ నేరాల పట్ల ఏమాత్రం అవగాహన లేని వారే ఎక్కువగా ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారన్నారు. విద్యార్థులు బావి భారతావని ఆస్తి అని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనా 100 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందివ్వాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ సాంకేతిక వల్ల ఎంత ఉపయోగం, మేలు జరుగుతుందో అంతే స్థాయిలో కీడు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింబయాసిస్ టెక్నాలజీస్ సీఈవో ఓ.నరేష్ కుమార్, డీన్ సుందర్ రామమ్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత విద్యార్థులకు స్టేషనరీ అందజేత



విద్యార్థులతో తహసీల్దార్ అమల, హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ తదితరులు

పెదగంట్యాడ: పాఠశాల స్థాయిలో వివిధ సంస్థల ప్రోత్సాహన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని పెదగంట్యాడ తహసీల్దార్ అమల అన్నారు. బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ నడుపూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులను దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఆ విద్యార్థులకు అవసరమైన రూ.18వేలు విలువ గల విద్యా సామగ్రితో పాటు నిత్యవసరాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటు వారికి అవసరమైన వస్తువులు, నిత్యావసరాలు ప్రతి నెలా అందజేయడం అభినందనీయమని సంస్థ అధినేత చాంద్ బాషాను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. కిరణ్, అరుణకుమారి, సురేష్,సుకేష్ నారాయణరావు, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి



ప్రసంగిస్తున్న స్వామీజీ వేద్యానంద

గాజువాక: ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని రామకృష్ణ మిషన్ స్వామీజీ శ్వాసం వేద్యానంద అన్నారు. వ్యక్తిత్వ వికాసంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సానుకూల ఆలోచనలు, సానుకూల దృక్పథంతో ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఎదురయ్యే అనుభవం ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకోగలుగుతారన్నారు. వ్యక్తి నిర్మాణం, వ్యక్తి పరివర్తన, సంస్కారాలు, పరిసరాల ప్రభావం, సానుకూల దృక్పథం, అనుభవాలు తదితర అంశాల ద్వారా వ్యక్తిత్వ వికాసం అలవడుతుందన్నారు. ప్రతి అంశాన్ని ఒక అవకాశంగా భావించాలని సూచించారు. శ్రద్ధాసక్తులు, అంకితభావంతో ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతోపాటు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు స్వామీజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు వి.తేజేశ్వరరావు, వై.ఈశ్వరరాజు, ఎస్.వి.కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ - 2 ఈఈ బి.కె. నాయుడు బుధవారం తెలిపారు. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది, చిట్టినాయుడుకాలనీ, పంతులుగారిమేడ, బీహెచ్‌పీవీ టౌన్ షిప్, అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రం, రాంనగర్, వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వెండి సహస్ర ధార బహూకరణ



ట్రస్ట్ సభ్యులకు సహస్ర ధారను అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి బుధవారం మద్దాల వెంకట సుధాకర్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు సుధీర్ శ్రీవారికి రూ.60,000 విలువగల వెండి సహస్ర ధారను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: ప్రతిభా వంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గౌరీ ప్రతిభా పురస్కారాలు 2023–24 ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఇంజినీరింగ్, మెడిసిన్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక మాస విశిష్టతపై ప్రచారం



వడ్లపూడిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతినిధులు

అగనంపూడి: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక విశాఖ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో విస్తృత ప్రచారం చేపట్టారు. కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్, అప్పారావు, నాగమణి, లక్ష్మి కార్తీక మాసంలో వెలిగించే దీపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రభోద సేవా సమితి ప్రతినిధులు నాగమణి, పద్మ, దేవి, మంగ, మహాలక్ష్మి, అంభిక తదితరులు పాల్గొన్నారు.

కార్తీకంలో హరిదాసుల సందడి

కానుకలు సమర్పిస్తున్న భక్తజనం



శ్రీరాముని భక్తి గీతాలతో పాటు హరినామాన్ని ఊరూరా ప్రచారం చేస్తున్న హరిదాసు సత్యనారాయణ

పెదగంట్యాడ: హరి నామాన్ని ప్రచారం చేయడంలో హరిదాసులు కీలకపాత్ర పోషిస్తున్నారు. హరినామ జపాన్ని ప్రతి ఒక్కరికీ తెలిసేలా కృషి చేస్తున్నారు. ఏటా హరిదాసులు మకర సంక్రాంతి సమయంలో ధనుర్మాసంలో ఊరూరా తిరుగుతూ శ్రీరాముడిని కొలుస్తుంటారు. ఆయన కీర్తనలు ఆలపిస్తూ ప్రజలు, భక్తులు ఇచ్చిన కానుకలను స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే పెదగంట్యాడలో మాత్రం అందుకు భిన్నంగా కార్తీక మాసంలోనే హరిదాసులు తిరుగుతూ హరి నామాన్ని ఆలపిస్తున్నారు. రాముడికి ఇష్టమైన దుస్తులు ధరించి, నెత్తిమీద అక్షయపాత్ర, భుజం మీద తుంబర, చేతుల్లో చిడతలు, కాళ్లకు గజ్జెలు కట్టుకుని హరినామం, రాముని కీర్తనలు తప్ప మరో ధ్యాస లేకుండా ఇంటింటికీ తిరుగుతున్నారు. భద్రాచలం సమీపానికి చెందిన అనే హరిదాసు కార్తీకమాసం ప్రవేశానికి ముందే ఒకరోజు కుటుంబ సభ్యులతో పెదగంట్యాడకు చేరుకుని తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ తర్వాత ఆయన, పెద్దకుమారుడు హరిదాసు వేషధారణ ధరించి శ్రీరాముని భక్తి గీతాలతో పాటు హరి నామాన్ని ఊరూరా ప్రచారం చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా శ్రీరామ నామాన్ని జపిస్తూ ఆయనకు ఇష్టమైన పాటలు, భక్తిగీతాలు, శ్రీహరి సంకీర్తనలు ఆలపిస్తూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తిరుగుతున్నారు.

మ్యాన్ హోల్.. బీ కేర్ ఫుల్



దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాజీవ్‌నగర్ కూడలి వరకు ఫ్లైఓవర్‌పై శిథిలమైన మ్యాన్‌హోల్ పైకప్పులు

ఫోకస్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతోంది. వంతెన శ్లాబ్ పలుచోట్ల శిథిలమై ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల రెయిలింగ్ దెబ్బతింది. ఇదిలా ఉండగా వంతెనపై ఉన్న ఫుట్‌పాత్‌లపై ప్రతీ 20 అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లపై పైకప్పులు శిథిలమైపోయాయి. కొన్ని శిథిలం కాగా మరికొన్ని పక్కకు తొలగించేశారు. దీంతో ఫుట్‌పాత్‌లపై కాకుండా రోడ్డు మీదుగా నడిచి వెళ్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. వీఎస్ఈజెడ్ ఉద్యోగులు, ప్రయాణికులు, ప్రైవేటు కళాశాల విద్యార్థులు సాయంత్రం వేళల్లో చీకటి అయిన తర్వాత ఫుట్‌పాత్‌లపై కాకుండా రోడ్డుమీద నుంచి వచ్చి వెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీఎస్ఈజెడ్, రైల్వే, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి మ్యాన్‌హోళ్లపై మూతలు వెంటనే అమర్చాలని కోరుతున్నారు.

హడలెత్తించిన నాగుపాము



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: నాగుపాము ఉక్కు నగరవాసులను హడలెత్తించింది. టౌన్‌షిప్ సెక్టార్–11లోని 118ఎ క్వార్టర్ బాత్‌రూమ్‌లో బుధవారం సుమారు ఆరడుగుల నాగుపాము కనిపించింది. దీంతో నివాసులు భయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే స్నేక్ సేవర్ సొసైటీ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే క్వార్టర్‌కు చేరుకుని బాత్‌రూమ్ వద్దకు వెళ్లి చూడగా అక్కడ పాము ఇరుక్కు పోయింది. కిరణ్ ఆ పామును ఒడిసి పట్టుకున్నారు. దీంతో క్వార్టర్‌లో ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు. పామును అటవీ శాఖ అధికారుల సూచన మేరకు వదిలిపెడతానని కిరణ్ తెలిపారు.